ప్రజాశక్తి
గురువారం 26 డిసెంబరు, 2024
5
శ్రీకాకుళం

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

వార్త 6లో...

నేలవాలిన వరి పంట

ఈ ఏడాది పంట బాగా పండింది. కొంతవరకైనా చేసిన అప్పులు తీరుతాయని ఆశించిన రైతుల ఆశలు ఆవిరయ్యాయి. వారం రోజులుగా పట్టుకున్న ముసురుతో చేతికందిన పంట నీటిపాలైంది. ఆరుగాలం పడిన కష్టం ఆవిరైంది. ఎన్నడూ లేని విధంగా డిసెంబరులో వచ్చిన వరుస అల్పపీడనాలు రైతుల పొట్ట కొట్టి కోలుకోలేని దెబ్బతీశాయి. పంట నీటిపాలై రైతు కంట కన్నీరు తెప్పిస్తోంది.

రైతు కంట కన్నీరు

- వదలని ముసురు
- నీటిలోనే వరిచేలు
- మొలకెత్తిన గింజలు
- భారీగా పంట నష్టం
- ప్రభుత్వం పైనే ఆశలు

ప్రజాశక్తి - కవిటి

వర్షాలకు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సుమారు నాలుగు వేల ఎకరాల్లో పంట దెబ్బతింది. చాలావరకు పంట నేలవాలి గింజలు మొలకెత్తాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే వర్షం తగ్గినా చాలావరకు పొలాల్లో పంట బయటకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే కోసిన పంటలో పనలు తడిసిపోయి గింజలు మొలకెత్తగా మరోవైపు కుప్పలు పెట్టిన పంట కూడా ముసురుకు దెబ్బతింది. దీంతో రైతన్నలు కోలుకోలేని దెబ్బ తిన్నారు.

చాలీచాలని పరిహారం

వాస్తవానికి ఒక ఎకరాలో 33 శాతం పైబడి నష్టం ఉంటేనే రైతుకు పరిహారం అందుతుంది. అదికూడా ప్రభుత్వం లెక్కల ప్రకారం హెక్టారుకు రూ.15 వేలు పరిహారంగా అందిస్తారు. ఈ ఏడాది పండిన పంట ప్రకారం హెక్టారుకు తక్కువలో తక్కువ 60 నుంచి 70 బస్తాల దిగుబడి వచ్చేది. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే 20 నుంచి 30 బస్తాలు కూడా వచ్చేలా లేదు. ఒకవేళ ప్రభుత్వం పరిహారమే అందిస్తే కేవలం రూ.15వేలు మాత్రమే రైతుకి అందుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నిర్ణయంపైనే రైతుల నష్ట పరిహారం ఆధారపడి ఉంది.

వజ్రపుకొత్తూరు : తుపాను కారణంగా కురిసిన వర్షాలతో అన్నదాత వెన్ను విరిగినంత పనైంది. పంట చేతికి వచ్చే సమయానికి గండెల్లో అలజడి రేపుతున్నాయి. రానున్న సంక్రాంతి పండగ సరదా అంతా వర్షాలతో తీరిపోయింది. గత నాలుగు రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఎడతెరిలేని జల్లులు వరికుప్పల్లోకి ఇంకుతున్నాయి. పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో 52,241 ఎకరాల్లో వంశధార, చెరువుల ఆధారంగా ఈ ఏడాది వరిపంట సాగు చేశారు. ప్రస్తుతం దాదాపు వరి కోతం పూర్తయ్యాయి. యంత్రాలతో అప్పటికప్పుడు 35 శాతం మేర పూర్తి చేశారు. ఇంకా 65 శాతం వరి పంట కుప్పల రూపంలో పొలాల్లోనే ఉంది. ఏటా అతివృష్టి, అనావృష్టి తమను వెంటాడుతుండడంతో నష్టాల భారిన పడుతున్నామని వాపోతున్నారు.

వ్యవసాయశాఖ సూచనలు పాటించాలి

అల్పపీడనం, వాయుగుండాలు వచ్చే సమయంలో రైతులను ముందుగానే అప్రమత్తం చేస్తున్నాం. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి అవగాహన కల్పిస్తున్నాం. వరికుప్పల్లోకి నీరు చేరకుండా టార్పాలిన్లు కప్పాలి. ఇందు కోసం రెవెన్యూ శాఖ ద్వారా తక్కువ ధరకే టార్పాలిన్ అందించాం. వర్షాల తగ్గాక రైతులు కుప్పలను పరిశీలించి తడి ఉంటే ఆరబెట్టుకోవాలి. రంగుమారకుండా, మొలకెత్తకుండా ఉండేందుకు ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి. అనుకూల సమయంలో నూర్పులు పూర్తి చేయాలి.

- ఎల్.వి. మధు, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు, పలాస

ఏం మిగల్లేదు

1.5 ఎకరాలో వరి పంట వేశాను. ఈ ఏడాది పంట బాగుంది. దిగుబడి బాగావస్తుందని అనుకున్నా. పంట చేతికి అందేసమయానికి ముసురు దెబ్బతీసింది. మా పంచాయతీ పరిధిలో పొలాలకు బీలనుంచి నీరు వచ్చి పంట మొత్తం నీటిలో ఉంది. ముసురు తగ్గినా ఏం మిగిలేలా లేదు. చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది.

- దొండపాటి గంగారావు, మధ్యపుట్టుగ

ఆరు నెలల కష్టం ఆవిరి

ఆరు నెలల కష్టం ఆవిరైంది. ప్రస్తుత పరిస్థితుల్లో రైతుకి ఏ విధంగాను అనుకూలంగా లేదు. సాగు ఖర్చులు పెరిగినా, వాతావరణం అనుకూలించకపోయినా ఉన్న భూమి బీడువారకుండా ఉండేందుకు కష్టపడి రెండెకరాల్లో వరి పంట వేశాను. మొత్తం నీటిలో ఉంది. ఎకరాకు 30 బస్తాలు రావల్సిన పంట. మూడు బస్తాలు వస్తాయో లేదో తెలీదు.

- దక్కత పురుషోత్తం రెడ్డి, నెలవంక

నివేదిక అందించాం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో చాలావరకు పంట దెబ్బతింది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించినప్పుడు మాకే కష్టం అనిపించింది. చాలావరకు గింజలు మొలకలు వచ్చాయి. కోసిన వరి పనులు నీటిలో ఉన్నాయి. ప్రస్తుతం రైతుల పరిస్థితి ఓ విధంగా దయనీయంగా ఉంది. పూర్తిస్థాయిలో నివేదికలు ఉన్నతాధికారులకు అందించాం. ప్రభుత్వం అన్నివిధాలుగా రైతులకు అండగా ఉంటుంది.

- జగన్మోహనరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు, సోంపేట

ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలి

- స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలి
- సిఐటియు డిమాండ్
- ఇపిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని పరిరక్షించాలని కోరుతూ, చండీఘర్ విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అక్కడి విద్యుత్ ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా సిఐటియు రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా నగరంలోని ఇపిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు రాజధానిగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతం చండీఘర్ డిస్కంను విద్యుత్‌రంగంలో ఏమాత్రం అనుభవం లేని కోల్‌కతాకు చెందిన కార్పొరేట్ సంస్థ 'ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్'కు అమ్మడానికి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. లాభాలను ఆర్జిస్తున్న చండీఘర్ డిస్కంను ప్రైవేట్ సంస్థకు ధారాదత్తం చేయడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. బాక్రానంగల్ ప్రాజెక్టు ద్వారా హైడ్రో పవర్‌తో ఒప్పందం ఉన్నందువల్ల దేశంలో అతి చౌకగా విద్యుత్ అందిస్తుందని చెప్పారు. అత్యధిక లాభాలు గడించే అవకాశాలున్న వాటినీ ప్రైవేటుపరం చేయడానికి కంకణం కట్టుకుందని విమర్శించారు. దేశంలోని పవర్ గ్రిడ్ సబ్‌స్టేషన్లను గంపగుత్తగా ప్రైవేట్‌కు కట్టబెట్టాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. స్మార్ట్‌మీటర్లు పెట్టి, సబ్సిడీలు ఎత్తివేసి విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచడానికి రంగం సిద్ధం చేస్తున్నారని తెలిపారు. చండీఘర్ తర్వాత మరికొన్ని రాష్ట్రాల డిస్కంలను అమ్మాలని నిర్ణయించిందన్నారు. ఈనెలాఖరుకు చండీఘర్ డిస్కం ఆస్తులను ప్రైవేట్ కంపెనీకి ధారాదత్తం చేయడానికి బిజెపి ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని చెప్పారు. అదే రోజు నుంచి కార్మికులు నిరవధిక సమ్మెకు వెళ్లడానికి సిద్ధమవుతున్నారని తెలిపారు. నాలుగేళ్లుగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడుతున్నారని తెలిపారు. మరోవైపు మన రాష్ట్రంలో అదానీతో జరిగిన అన్నిరకాల విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలన్నారు. ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్ల వల్ల ప్రజలందరిపై భారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జ్ చేయించుకోవాల్సి ఉంటుందని, బ్యాలెన్స్ పూర్తి కాగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. దీనివల్ల పేదలకు అంధకారమే మిగులుతుందన్నారు. ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, ఎం.ఆదినారాయణమూర్తి, నాయకులు అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, డి.సుధ, ఆర్.ప్రకాష్, పి.గోవర్ధనరావు, కె.కళ్యాణి, పి.లత తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

ఒప్పంద అంశాలను అమలు చేయాలి

- అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి
- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, 42 రోజుల సమ్మె ఒప్పందంలో అంగీకరించిన అంశాలను అమలు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన యూనియన్ జిల్లాస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం రకరకాల యాప్‌లు తెచ్చి పనిభారం పెంచిందన్నారు. మరోవైపు సెంటర్ నిర్వహణకు ఇవ్వాల్సిన బిల్లులు, అద్దెలు సక్రమంగా చెల్లించడం లేదని విమర్శించారు. గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. అప్పులు చేసి మరీ కేంద్రాలను నడపుతున్న అంగన్వాడీలు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదన్నారు. గతేడాది డిసెంబరు 12 నుండి ఈ ఏడాది జనవరి 22వ తేదీ వరకు 42 రోజుల పాటు అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి అంగీకరించిందన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని కూటమి నేతలు హామీనిచ్చారని గుర్తు చేశారు. గ్రాట్యుటీ అమలు చేస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలవుతున్నా చర్చలకు పిలవలేదన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులకు రూ.20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన మార్గదర్శకాలు రూపొందించి అమలు చేయాలని కోరారు. ప్రీ స్కూల్ బలోపేతం చేయాలి. ప్రీ స్కూల్ పిల్లలకూ తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలందరూ అంగన్వాడీ సెంటర్లో ఉండాలని జిఒ ఇవ్వాలని, ప్రీ స్కూల్ పిల్లలకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని కోరారు. సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయాలని, సెంటర్ల నిర్వహణకు అమలు చేస్తున్న అన్ని యాప్‌లు ఒకే యాప్‌గా మార్పు చేయాలన్నారు. ఇకెవైసి, చిన్నపిల్లలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కోరారు. మెనూ, మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు వేతనంతో కూడిన మెడికల్ లీవ్ కనీసం మూడు నెలలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు పి.లత, కె.సుజాత, వి.హేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ బహుమతి అందుకున్న పవిత్ర

సత్తా చాటిన మత్స్యకార బిడ్డ

కవిటి: మండలంలోని కపాసుకుద్దికు చెందిన మత్స్యకార బిడ్డ పి.పవిత్ర శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బికాం తృతీయ సంవత్సరం చదువుతూ రాష్ట్రస్థాయిలో సత్తా చాటింది. ఈ మేరకు రాజధాని అమరావతిలో పౌరసరఫరాల శాఖ నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పవిత్ర ప్రథమ బహుమతి సాధించినట్లు వాణిజ్య శాస్త్రవేత్త విభాగాధిపతి ఎల్.కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా బహుమతి అందుకున్న పవిత్రను కళాశాల అధ్యాపక బృందంతో పాటు గ్రామస్తులు, సహచరులు అభినందించారు.

పత్తి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి- లావేరు

వర్షాలకు నష్టపోయిన పత్తి రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు పొందూరు చంద్రరావు, కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అదపాక, కొత్తకోట భీమిడిపాలెం, బుడుమూరులో బుధవారం పర్యటించి పాడైన పంటలను పరిశీలించారు. బాధిత రైతులు తమ కష్టనష్టాల గోడును వారి వద్ద వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో లేక గిట్టుబాటు ధరకు నోచుకోవడం లేదని చెప్పారు. దీంతో దళారుల చేతుల్లో రైతులు మోసపోతున్నారని తెలిపారు. పత్తి క్వింటాకు రూ.7,521 మద్దతు ధర ప్రకటించినా, క్షేత్రస్థాయిలో రూ.ఆరు వేలకు మాత్రమే కొంటున్నారని చెప్పారు. రైతులకు మద్దతు ధర దక్కేలా సిసిఐ అధికారులు చొరవ చూపడం లేదని విమర్శించారు. రైతులు పత్తిని ఆరబెట్టి నిల్వ చేయడం కష్టంగా ఉందన్నారు. స్థలం లేకపోవడంతో పొలం నుంచి తీసుకొచ్చిన వెంటనే అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. జిల్లాలో లావేరు మండలంలో పత్తి ఎక్కువగా పండిస్తున్నారని, ఇక్కడ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో పత్తికి గులాబీ రంగు పురుగు సోకడంతో దిగుబడి తగ్గుతోందని, వ్యవసాయ శాస్త్రవేత్తలు దీని నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కామినాయుడు, ఆదినారాయణ, మోహన్, తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటను పరిశీలిస్తున్న రైతు, కౌలు రైతు సంఘం నాయకులు

గుడ్ గవర్నెన్స్‌తో పారదర్శక పాలన

మాట్లాడుతున్న వెంకట్ ఉజ్వల్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పారదర్శక పాలన అందించడమే గుడ్ గవర్నెన్స్ ముఖ్య ఉద్దేశమని నెహ్రూ యువ కేంద్రం సమన్వయకర్త కె.వెంకట్ ఉజ్వల్ అన్నారు. నగరంలోని శాంతినగర్ జూనియర్ కళాశాలలో యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖల ఆధ్వర్యాన గుడ్ గవర్నెన్స్ డేను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక వనరుల నిర్వహణలో అధికారాన్ని సక్రమంగా, సమర్థవంతంగా ఉపయోగించుకోవడం, పౌర కేంద్రీకృత సుపరిపాలన పునాదిపై ఆధారపడి ఉంటుందన్నారు. సెట్‌శ్రీ సిఇఒ బి.ప్రసాదరావు మాట్లాడుతూ పాలనలో ప్రతిఒక్కరి భాగస్వామ్యాన్ని నిర్ధారించడం, పౌరులు తమ అభిప్రాయాలను చట్టబద్ధమైన సంస్థలు, ప్రజాప్రతినిధుల ద్వారా వ్యక్తం చేసే అవకాశాన్ని పొందవచ్చన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న వర్గాలకు ఇది ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శాంతినికేతన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.అప్పలరాజు, ఎస్.సత్యనారాయణ, నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వాన దెబ్బకు

రోడ్లు ధమాల్

- అధ్వానంగా తయారైన వైనం
- అవస్థలు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి- పలాస, మెళియాపుట్టి

అల్పపీడనం కారణంగా ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామీణ రోడ్లు దెబ్బతున్నాయి. ఏ రోడ్డుపై తొంగిచూసినా పెద్ద పెద్ద గోలుతులు తయారయ్యాయి. ప్రభుత్వాలు మారినా ఆ గిరిజన గ్రామాల రోడ్డుకు మోక్షం కలగడంలేదు. రోడ్డు పొడుగునా గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు, వాహన చోదకులకు అవస్థలు తప్పడం లేదు. గిరిజన గ్రామాలు అభివృద్ధి చేస్తాం... పక్క రోడ్లు నిర్మిస్తాం... త్వరితగతిన పనులు పూర్తిచేసి అంకితం ఇస్తామంటూ రాజకీయ నాయకులు నుంచి అధికారులు వరకు పదే పదే బహిరంగ సభలో సమావేశాల్లో చెప్పడమే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఐదేళ్ల గడుస్తున్నా 10 శాతం కూడా పనులు చేపట్టకపోవడంపై గిరిజనుల నుంచి సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరింది. వాహనాలు రాకపోకలు సాగించడంతో అవి కాస్త పెద్దయ్యి, గోయ్యో... నీరో తెలియని పరిస్థితి.

మండలంలోని సవర గోవిందపురం రోడ్డు నుంచి కోటారింగ్ తాళభద్ర వరకు పక్క రోడ్లు లేక ఆ ప్రాంత గిరిజనులు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సవర గోవిందపురం రోడ్డు నుంచి మహాదేవపురం, పొత్రియ, బాపనూరు, బాలాజీరు, గట్టుమీదూరు, కొటారింగ్ తాళంభద్ర తదితర ప్రాంతాల గిరిజనులు నిత్యం ఈ రోడ్డుపై రాకపోకలు చేస్తుంటారు. ఈ ప్రాంత ప్రజలు, గిరిజనులు రాకపోకలు చేసేందుకు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని అప్పటి ఎమ్మెల్యే గౌతు శ్యాం సుందర శివాజీ ఎఐఐబి నిధులు రూ.2.12 కోట్ల వ్యయంతో తారు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు మరలా రోడ్డుకు శంకుస్థాపన చేశారు. పది శాతం పనులూ చేపట్టకుండా విడిచిపెట్టారు. దీంతో సుమారు ఐదేళ్లుగా తారు రోడ్డు పనులు చేపడతారని ఆశతో ఎదురు చూడడం తప్ప పనులకు నోచుకోవడం లేదు. రోడ్డుపై కేవలం అక్కడ అక్కడ క్రషర్ బుగ్గి వేసి వదిలేశారని గిరిజనులు వాపోతున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తున్నప్పుడు విపరీతంగా క్రషర్ బుగ్గి దూలి ఎగిరి మీద పడుతుందని, రాత్రి సమయాల్లో వాహనాలతో ప్రయాణం చేసేటప్పుడు ధూళి కంటిలో పడి వాహనాలు నడిపేందుకు ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రోడ్డు అంతా గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జి డిఇఇ రవిబాబును వివరణ కోరగా, గతంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టరు పనులు చేయకుండా విడిచి పెట్టి వెళ్లిపోయారని చెప్పారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

పలాస : నీరు చేరి బురదమయమైన రోడ్డు

మెళియాపుట్టి : గుంతలమయమైన రోడ్డు

మెళియాపుట్టి మండలంలో పలుచోట్ల బిటి రోడ్లు గుంతలు ఏర్పడి నరకయాతనగా తయారవుతున్నాయి. ప్రభుత్వం ఆదేశాలతో కొన్నిచోట్ల గుంతలు పూడ్చారు. అయితే గుంతలు పూడ్చిన చోట నాణ్యత లేక వర్షాలకు మళ్లీ పాడయ్యాయి. పట్టుపురం- చాపర దగ్గర ఇదే పరిస్థితి నెలకొంది. ఒడిశా సరిహద్దులోని మండల శివారు ప్రాంతమైన రంపకాన నుంచి గొప్పిలిమధ్య రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిండా గుంతలు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతపు ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే మెళియాపుట్టి-పెద్దపద్మపురం, ఆల్ ఆంధ్రా రోడ్డు దయానియంగా మారింది. అలాగే గోపీనాథపురం సమీపంలోనే కల్వర్టు వద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆర్అండ్‌బి అధికారులు దృష్టి సారించి రోడ్డు గొంతులను సత్వరం పూర్తి చేయాలని ఈ ప్రాంతపు ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

తారు రోడ్డు పూర్తి చేయాలి

ఐదేళ్లుగా తారు రోడ్డు వేస్తామని చెబుతున్నారే తప్ప రోడ్డు పూర్తి చేయడం లేదు. గోతులు రోడ్డుపై ప్రయాణం చేయడం కష్టంగా ఉంది. అధికారులు స్పందించి తారు రోడ్డు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి.

- సవర విజయ్, పొత్రియ, పలాస

రోడ్డు పనులకు నోచుకోవడం లేదు

తారు రోడ్డు వేస్తామని చెప్పగానే ఎంతో ఆనందం పడ్డాం. కానీ చిరకాల వాంఛ నెరవేరడం లేదు. కానీ, అప్పటి నుంచి ఇప్పటి వరకు రోడ్డు పనులకు నోచుకోవడం లేదు. రోడ్డుపై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. త్వరగా రోడ్డు పనులు చేపట్టేలా చూడాలి.

- సవర వెంకటేష్, పొత్రియ , పలాస

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
పాతపట్నం
OS. 2/2024

Between:- క్రి కుమారి .....వాది
And:- క్రి రాము .....ప్రతివాది

To,
క్రి రాము, S/o లేటు లక్ష్మీనారాయణ, వయసు 40 సంవత్సరాలు, హిందూ, ఫైనాన్స్ అండ్ రియల్ ఎస్టేట్ వ్యాపారం, కుమ్మరిగుంట గ్రామం, సారవకోట మండలం, శ్రీకాకుళం జిల్లా

పై నెంబరు OS.2/2024 దావాలో గల వాది ప్రతివాదిపై ప్రాంసరీ నోటు దావా దాఖలు చేయగా, సదరు దావా తేదీ **27-12-2024న పై కోర్టులో వాయిదా అయి ఉన్నది.** ఆదినమున ప్రతివాది పై **కోర్టులో ఉదయం 10:30 గంటలకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకునవలెను. లేనియెడల సదరు దావా OS.2/2024ను మీ పరోక్షమందు విమర్శించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి అనుమతితో //

గేదెల ఫల్గుణరావు
వాది తరుపు న్యాయవాది,
పాతపట్నం.

27న జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రంలోని టౌన్‌హాల్ వేదికగా ఈ నెల 27న జిల్లాస్థాయి ఫెన్సింగ్ క్యాడెట్ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 బాయ్స్ అండ్ గర్ల్స్ విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే బాలబాలికలు ముందుగా ఈనెల 26వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. పేర్లను నమోదు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 27న ఉదయం 8 గంటలకు నేరుగా టౌన్‌హాల్ వద్దకు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన ఐడికార్డు, జిరాక్స్ కాపీతో పాటు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్, వ్యక్తిగత ఫెన్సింగ్ ఎక్విప్మెంట్‌తో హాజరుకావాలన్నారు. జిల్లాస్థాయి పోటీలకు 1 జనవరి 2008 నుంచి 21 డిసెంబర్ 2011 మధ్య పుట్టినవారు మాత్రమే అర్హులన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఈ నెల 28, 29 తేదీల్లో కాకినాడలోని లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్లో జరగనున్న ఇంటర్ డిస్ట్రిక్ట్ క్యాడెట్ ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ 2024-25 పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు కోచ్‌ను సంప్రదించాలని సూచించారు.

శిక్షణ ఇస్తున్న లక్ష్మి

కుటీర పరిశ్రమల స్థాపనపై శిక్షణ

మందస: సూక్ష్మ, చిన్న, కుటీర పరిశ్రమల స్థాపనకు అవసరమైన శిక్షణలు ఇస్తున్నామని ఐటిడిఎ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని సొండిపూడి, మూలిపాడు గ్రామాలకు చెందిన స్వయం ఉపాధికి ఔత్సాహిక మహిళలను గుర్తించి నాగావళి ఉచిత స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సౌజన్యంతో మూడు రోజులుగా స్వయం ఉపాధి శిక్షణ నిర్వహిస్తున్నట్లు వివరించారు. శిక్షణలో నైపుణ్యం పొందిన మహిళలందరికీ సంస్థ ద్వారా ధ్రువపత్రాలను అందజేస్తామన్నారు. యూనియన్ బ్యాంకు ద్వారా సూక్ష్మ, చిన్న, కుటీర పరిశ్రమలు స్థాపనకు అవసరమైన పెట్టుబడి, మిషనరీల కొనుగోలు నిమిత్తం రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షకురాలు లక్ష్మి మాట్లాడుతూ మహిళలు సొంతంగానే కొవ్వొత్తులు, డిటర్జెంట్ పౌడర్, శానిటేషన్ ఫినాయిల్ ఇంటి వద్దనే తయారు చేసుకునేందుకు వీలైన శిక్షణలు ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విఒఎలు కుసుమ, తులసి క్లస్టర్ కోఆర్డినేటర్ తారక మోహన్ పాల్గొన్నారు.

ఎపిపి శ్రీనుకు ఎమ్మెల్యే అభినందనలు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియామకమైన కింజరాపు శ్రీనును ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం అభినందించారు. విశాఖ ఎ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శ్రీనుకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్న శ్రీనుకు ఈ పదవి దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మృదు స్వభావి, స్నేహశీలి, అందరితో కలిసిమెలిసి ఉండే శ్రీను వంటి వ్యక్తులకు ఈ పదవులకు మరింత వన్నె తేవాలని ఆయన ఆకాంక్షించారు. మరింత బాధ్యతగా వ్యవహరించి పేదలకు న్యాయ సేవలు అందజేయాలని శ్రీనుకు కోరారు.

ఆ నేత్రాలు సజీవం

పొందూరు: మండలం బొడ్డేపల్లిలో బొడ్డేపల్లి రాములు (94) బుధవారం మృతి చెందారు. ఈ సందర్భంగా మృతుని నేత్రాలను దానం చేయాలని నిర్ణయించుకుని కుటుంబసభ్యులు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావుకు సమాచారం అందించారు. దీంతో మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రానికి సమాచారం అందించగా నేత్ర టెక్నీషియన్స్ సుజాత, ఉమాశంకర్ ఆధ్వర్యంలో మృతుని కార్నియాలను సేకరించారు. అనంతరం నేత్రాలను విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ కంటి నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. మృతుని నేత్రాలను దానం చేసి మరో ఇద్దరికి కంటిచూపును ప్రసాదించాలన్న కుటుంబసభ్యుల ఆదర్శవంతమైన నిర్ణయంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నాటుసారాను అరికట్టాలని వినతి

సోంపేట: మండలంలోని కొర్లం పంచాయతీ పరిధిలో నాటుసారా అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జాగృతి స్వచ్ఛంద సంస్థ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రామ్‌బుడ్డి గణపతి కోరారు. ఈ మేరకు బారువ ఎస్ఐ హరిబాబును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కొర్లం, జీడి పుట్టుగా గ్రామాలు నాటుసారాకు కేంద్రాలుగా మారాయని, దీంతో ఆయా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సర్పంచ్ ప్రతినిధి, నీటి సంఘం అధ్యక్షుడు రామ్‌బుడ్డి జానకిరావు, ఉప సర్పంచ్ తామాడ వాసుదేవరావు, నీటి సంఘ అధ్యక్షుడు పి.జోగారావు, ఎస్.రామస్వామి, పి.ప్రతాప్ పాల్గొన్నారు.

కూరగాయల రైతు కుదేలు

వదలని వర్షం.. రైతులకు తీవ్ర నష్టం

వర్షం దెబ్బకు కూరగాయల రైతులు విలవిలాడుతున్నారు. ఒకవైపు అపరాల పంటలను సాగు చేస్తున్న రైతులను నిండా ముంచిన అకాల వర్షం కూరగాయ రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

ప్రజాశక్తి- బూర్జ

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కూరగాయ రైతులకు గుండె కోతను మిగిల్చింది. ఖరీఫ్ సీజన్‌లో సెప్టెంబర్ నెలలో కురిసిన వర్షాలకు వరి సాగుచేసిన రైతులు కేవలం నష్టాలను చవి చూశారు. రబీలోనైనా నష్టాల నుంచి గట్టెక్కుతామన్న ఆశతో ముందుకు వచ్చిన రైతులకు అపరాల పంటల్లో కూడా పూర్తిగా నష్టం వాటిల్లె పరిస్థితి తలెత్తింది. ఇప్పటికే అపరాల పంటలైన పెసర, మినుము, మొక్కజొన్న పంటలు నీటి మునిగి రైతులకు కన్నీళ్ళని మిగిల్చాయి.

అయోమయ స్థితిలో కూరగాయల రైతులు

ప్రస్తుతం బుధవారం విస్తారంగా వర్షం కురుస్తుంటే మండలంలోని కూరగాయల రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కూరగాయల సాగుతో జీవనం సాగిస్తున్న ఆ కుటుంబాలకు వర్షం నిండా ముంచిందని వాపోతున్నారు. ఒకవైపు పండించిన పంటలు కొనే నాధుడు లేక నష్టాలు చవి చూస్తుంటే మరోవైపు ఎడతెరిపి లేని వర్షాలకు పంటలు నష్టపోయే పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రంగు మారిన క్యాబేజీని చూపిస్తున్న రైతు (ఇన్‌సెట్‌లో) కుళ్లిపోయిన క్యాబేజీ పువ్వు

కుళ్లుతున్న క్యాబేజీ

ప్రతి ఏడాది ఈ సీజన్‌లో క్యాబేజీ పండించిన రైతులకు లాభాలను కళ్ళ చూసేవారు. అక్టోబర్ నెల నుంచి జనవరి వరకు క్యాబేజీ పంట విస్తారంగా పండడమే కాకుండా అధిక లాభాలను క్యాబేజీ రైతులు అర్జించేవారు. అయితే ఈ ఏడాది తమ ఆశలపై వరుణ దేవుడు నీళ్ల జల్లాడని కూరగాయల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంత మంచు కురిస్తే అంత పువ్వు పెరుగుతుందని దానివలన నాలుగు డబ్బులు కళ్ల చూసేవారు. మండలంలోని కిలంతరి, బూర్జ తదితర గ్రామాల్లో కూరగాయలను ఎక్కువగా పండిస్తున్నారు. ఈ వర్షాలకు క్యాబేజీ పువ్వులు రంగు మారుతున్నాయని అంతేకాకుండా పురుగు కూడా పడుతుందని రైతులు వాపోతున్నారు. రంగు మారిన పువ్వులను విక్రయించేందుకు కూడా అవకాశం లేదని, మరోవైపు చీడ పురుగుల నివారణకు పిచికారి చేయడానికి కూడా అవకాశం లేని పరిస్థితి ఉందని, ప్రస్తుతం పొలాల్లోనే క్యాబేజీ పువ్వులను విడిచి పెట్టాల్సిన పరిస్థితి ఎదురైందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు సుమారు రూ.25 వేలు పెట్టుబడి పెట్టామని, అయితే కనీసం పెట్టుబడులు కూడా వచ్చిన పరిస్థితి కనిపించడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన తమకు ఆదుకోవాలని కూరగాయల రైతుల కోరుతున్నారు.

పొలాల్లోనే విడిచిపెట్టేస్తున్నాం

కష్టపడి పండించిన క్యాబేజీ పంట పూర్తిగా కూల్లిపోయిన పరిస్థితి ఉంది. కోతకు వచ్చిన పువ్వు రంగు మారడంతో పాటు పురుగు పట్టడంతో విక్రయించేందుకు కూడా పనికిరాదు. క్యాబేజీ పువ్వులను కోయకుండా పంట పొలాల్లోనే విడిచిపెడుతున్నాం. దీంతో తాము పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఎదురైంది.

- లంక జగన్నాథం, కూరగాయల రైతు, కిలంతరి

క్యాబేజీ పంటకు నష్టం

విస్తారంగా కురుస్తున్న వర్షాలు క్యాబేజీ పంటకు నష్టమే. క్యాబేజీ పువ్వు దశలో ఉన్నప్పుడు రంగు మారితే నివారణ చర్యలు ఉండవు.

- హయంతి, ఉద్యానవనశాఖ అధికారి, బూర్జ

హరిబాబు నియామకంపై అచ్చెన్న హర్షం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఒడిశా గవర్నర్‌గా నియమితులైన ఉత్తరాంధ్ర ప్రాంత బిజెపి సీనియర్ నాయకులు కంభంపాటి హరిబాబును నియమించడంపై వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. కంభంపాటితో తన సోదరుడు ఎర్రన్నాయుడి సన్నిహిత సంబంధాలు కలిగి ఉండేవారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఒడిశా రాష్ట్ర గవర్నర్‌గా ఆయన్ను నియమించడం వల్ల రెండు రాష్ట్రాల మధ్య మరింత సన్నిహిత సంబంధాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

పరామర్శిస్తున్న విప్ అశోక్

ప్రభుత్వ విప్ పరామర్శ

ఇచ్ఛాపురం: టిడిపి నాయకుడు ఎస్.ఎన్.పండా సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ పండా కుటుంబానికి బుధవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం ఇటీవల మృతి చెందిన దుర్గా ప్రసాద్ పట్నాయక్ కుటుంబానికి పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నందిక జాని, కాళ్ల దిలీప్‌కుమార్, ఆర్.జానకిరావు, కె.ధనుంజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

నరేష్‌తో మాట్లాడుతున్న విజయ

జెడ్‌పి చైర్‌పర్సన్ పరామర్శ

కవిటి: మండలంలోని జల్లుపుట్టుగకు చెందిన జల్లు నరేష్‌ను జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ బుధవారం పరామర్శించారు. టోల్ గేట్‌లో విధులు ముగించుకొని ఇంటికి వస్తున్న నరేష్ పంది ఎదురుగా రావడంతో సోమవారం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆమె పరామర్శించి నరేష్‌తో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని ఎటువంటి సహాయం అవసరమైన చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బెందాళం జయప్రకాష్, జల్లు యుగంధర్, బదకల భాస్కరరావు, కొరికాన మాధవరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ మెంబర్

ఆమదాలవలస: జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ మెంబర్ తాళాబత్తుల ధనుంజయరావు ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న ఎమ్మెల్యే స్వగృహానికి వెళ్లి ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గడచిన 34 ఏళ్లుగా వాలంటరీ ఆర్గనైజేషన్‌లో సేవలు అందించడంతో పాటు సుదీర్ఘ కాలం పాటు జర్నలిస్టుగా, న్యాయవాదిగా పనిచేసిన తనను ప్రభుత్వం గుర్తించి కమిటీలో స్థానం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అధైర్యపడొద్దు అండగా ఉంటా..

ప్రజాశక్తి- శ్రీకాకుళం

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే గొండు శంకర్ అండగా నిలిచారు. నగరంలోని దమ్మలవీధిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడిన ఫాతిమా బేగం కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్యే శంకర్ పరామర్శించి ధైర్యం చెప్పారు. ఫాతిమా బేగం ఫుట్ పాతులపై బొమ్మలను విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. ఈ అగ్ని ప్రమాదంలో రూ.రెండు లక్షల విలువచేసే బొమ్మలు, లక్ష విలువ చేసే నగదు, ఇతర గృహోపకరణాలు, దుస్తులు సర్వం కాలి బూడిదైపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకర్ తక్షణమే స్పందించి ఆ కుటుంబానికి తన వంతుగా రూ.10 వేలు నగదుతో పాటు నెల రోజులకు సరిపడే నిత్యవసర సరుకులను, దుస్తులను అందజేశారు. స్థానిక తహశీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే ఆర్థికసాయం అందించేలా చర్యలు చేపట్టారు. వెంటనే తహశీల్దార్ స్పందించి రూ.10 వేలు ఆ కుటుంబానికి అందజేశారు. త్వరలోనే ప్రభుత్వం పరంగా రావాల్సిన సౌకర్యాలు అందేలా చూస్తానని ఎమ్మెల్యే ఆ కుటుంబానికి హామీఇచ్చారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెఎల్ ఉద్యోగోన్నతులు కల్పించాలి

ప్రజాశక్తి- టెక్కలి

40 శాతం జెఎల్ ఉద్యోగోన్నతులు కల్పించాలని ఎపి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సవన్నగారి బాలాజీ డిమాండ్ చేశారు. స్థానిక యోగా భవనంలో జిల్లా అధ్యక్షులు దుప్పల శివరామ ప్రసాద్ అధ్యక్షతన బుధవారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 302 జిఒ ప్రకారం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు ఇంటర్మీడియట్ బోధించేందుకు జూనియర్ లెక్చరర్లు ఉద్యోగోన్నతులు కల్పించారని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రభుత్వం దానిని రద్దు చేసిందని, దీనిపై పున:సమీక్షించాలని కోరారు. పది నాన్ టీచింగ్ సిబ్బందికి జెఎల్‌సిగా ఉద్యోగోన్నతులు ఇస్తున్నప్పుడు... బోధన అనుభవం ఉన్న ఉపాధ్యాయులకు జెఎల్‌గా ఉద్యోగోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం 12వ పిఆర్‌సి ప్రకటించాలని, అంతవరకు ఐఆర్ ఇవ్వాలని, కూటమి మేనిఫెస్టో ప్రకారం ఉపాధ్యాయ సమస్యలను పరిశీలించాలని తీర్మానించారు. సమావేశంలో రాష్ట్ర గౌరవ సలహాదారులు, తమిళనాడు కార్యదర్శి దువ్వాడ చలపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరసింహరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాలాజీ

కవులు, రచయితలను సన్మానం చేస్తున్న వినోద్

సమస్యలపై స్పందించాలి

ప్రజాశక్తి- పలాస

సమాజంలో జరుగుతున్న సమస్యలపై ఉద్దానం రచయితలు స్పందించాలని, సమాజాన్ని జాగృతం చేయాలని ఉద్దానం రచయితల సంఘం అధ్యక్షుడు కుత్తుం వినోద్ అన్నారు. మండలంలోని మాకన్నపల్లి లో బుధవారం ఉరసం ఆవిర్భావ సంఘాన్ని ప్రారంభించారు. ముందుగా విప్లవ కవి సుబ్బారావు ప్రాణిగ్రాహి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. బొడ్డపాడుకు చెందిన జానపద కళాకారుడు గేదెల అప్పారావు స్వగృహానికి వెళ్లి కుత్తుం తాతారావు స్మారక పురస్కారంలో భాగంగా రూ.5 వేలు నగదు, జ్ఞాపికను అందజేశారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం కవ్వం పుస్తకంలోని పాటలను కవి, ప్రముఖ సీనియర్ జర్నలిస్టు రాజారావు స్వయంగా పాడి శ్రోతలకు వినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కవులు, రచయితలను ప్రోత్సహించడం చాలా అవసరమన్నారు. ఉద్దానంలోని ప్రముఖ కవి, రచయితలు, కళాకారులను సీనియర్ జర్నలిస్టు పొట్టి శివకుమార్, రచయితలు కోనేరు ఆదినారాయణ, మడ్డు నాగేశ్వరరావు, బత్తిని వినోద్ కుమార్, గాయకులు బత్తిని శాంతారావు, బోకర తిరుపతి, పోతనపల్లి పోలయ్య, డప్పు కళాకారుడు రామారావులను సన్మానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కుమార్‌నాయక్, శాంతారావు మాస్టారు పోతనపల్లి కుసుమ, తామడ లత, తెప్పల రవివర్మ, పోతనపల్లి వెంకటేష్, కోయిల కోటేశ్వరరావు, సాలిన మురళీకుమార్, కుత్తుం సుధాకర్, కుత్తుం ప్రసాద్, రాజేశ్వరి, లలిత, సైని మధు, లక్కోజి చిరంజీవి, రత్నాల ఆదర్శ్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ఆమదాలవలస: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు. బుధవారం మండలంలోని అక్కులపేటలో ఎస్‌పి ఆదేశాల మేరకు సంకల్పం పేరిట మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్ యాక్ట్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయిని ఎవరైనా విక్రయించినా లేదా సరఫరా చేసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు అకౌంటు వివరాలు, ఎటిఎం పిన్‌కోడ్ వివరాలను ఎవరైనా అడిగితే అటువంటి వారికి చెప్పవద్దని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లకు వాహనాలను ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

మృతి చెందిన శిశువు

ఆస్పత్రిలో శిశువు మృతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి జిల్లా ఆస్పత్రిలో బుధవారం వేకువజామున శిశువు మృతి చెందాడు. నందిగాం మండలం కైజోలకు చెందిన శ్రావణి డెలివరీకి ఆస్పత్రిలో చేరింది. వేకువజామున పురిటినొప్పులు ఎక్కువ కావడంతో సాధారణ కాన్పులో బిడ్డకు జన్మనిచ్చింది. అప్పటికే అస్వస్థతకు గురైన శిశువు కొద్ది సేపటికే మృతి చెందింది. శిశువు మృతికి ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆరోపిస్తూ నిరసన తెలిపారు. రాత్రి 2 నుంచి వైద్యులకు ఫోన్ చేస్తున్నామని, రాత్రి రాకుండా తెల్లవారి 6 గంటలకు వచ్చి వైద్య సేవలు అందజేశారని బాలింత కృష్ణవేణి ఆరోపించారు. అయితే గర్భిణికి సకాలంలో వైద్యం అందించి చికిత్స అందించినా ఆపరేషన్ చేసే అవకాశం లేక సాధారణ కాన్పు ద్వారా బిడ్డను బయటకు తీశామని వైద్యులు తెలిపారు. అప్పటికే పేగులు మెడకు చుట్టుకుని అస్వస్థతకు గురై శిశువు మృతి చెందినట్లు వెల్లడించారు.

మృతి చెందిన త్రినాథరావు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలో నెలివాడ జంక్షన్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిసిని గ్రామానికి చెందిన ఇజ్జాడ త్రినాథరావు (50) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు త్రినాథరావు తన భార్య లక్ష్మి, మేనల్లుడు మీసాల ప్రసాద్ ద్విచక్ర వాహనంపై గిరివానిపాలెంలో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఫ్లైఓవర్ కింద నుంచి తిరుగుతుండగా అదే సమయంలో శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో ద్విచక్ర వాహనాన్ని మేనల్లుడు నడుపుతుండగా మధ్యలో కూర్చున్న త్రినాథరావు అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య లక్ష్మికి బలమైన గాయాలవ్వడంతో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న జె.ఆర్.పురం ఎస్ఐ చిరంజీవి సంఘటనా స్థలానికి చేరుకొని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మాజీ వైస్ ఎంపిపి ఆకస్మిక మృతి

ప్రజాశక్తి- పొందూరు

పట్టణానికి చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి, మాజీ వైస్ ఎంపిపి కాకార్ల రాజారావు (55) బుధవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఉదయం కొండవీధిలో ఉన్న తమ వస్త్ర దుకాణం వద్ద ఆర్థిక లావాదేవీల విషయంలో ఒక వ్యక్తితో స్వల్పంగా వాగ్వివాదం జరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దుకాణంలో పని చేస్తున్నవారు వెంటనే రాజారావును శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రాజారావు సతీమణి చల్లమాంబ ప్రస్తుతం మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా ఉన్నారు. రాజారావు తండ్రి పైడిలింగం పొందూరు మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. ఈ ఏడాదిలోనే రాజారావు, ఆయన తల్లిదండ్రులు మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. రాజారావు మృతిపై ఎమ్మెల్యే కూన రవికుమార్ తన సంతాపాన్ని తెలిపారు.

జారిపడిన మద్యం బాటిళ్లు

జారిపడిన మద్యం సీసాలు

ప్రజాశక్తి- పలాస

శ్రీకాకుళం నుంచి పలాస వస్తున్న వాహనంలో మద్యం బాటిళ్లతో కూడిన బాక్సులు జారిపడ్డాయి. దీనిని గమనించని వాహన డ్రైవర్ ముందుకు పోవడంతో మరికొద్ది దూరంలో మరోసారి వైన్ బాటిల్ బాక్సులు రోడ్డుపై పడ్డాయి. విషయం తెలుసుకున్న మందుబాబులు మద్యం బాటిళ్ల కోసం ఎగబడ్డారు. దొరికిన మద్యం బాటిళ్లను కొన్ని ఎత్తుకుపోగా.. చాలావరకు మద్యం బాటిళ్లు ధ్వంసమయ్యాయి. దీంతో రహదారిపై మద్యం ఏరులై పారింది. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ.. రోడ్డుపై ఉన్న గాజు పెంకులను తొలగించారు.

28న మండల సర్వసభ్య సమావేశం

లావేరు: లావేరు మండల పరిషత్ సర్వసభ సమావేశం డిసెంబర్ 25న ఉదయం 11 గంటలకు సమావేశ మందిరంలో ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఒ పి.వెంకటరాజు తెలిపారు ఈ సమావేశానికి జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు. సంబంధిత శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయి సమాచారంతో సకాలంలో హాజరు కావాలన్నారు.

పోరుబాటను విజయవంతం చేయాలి

ఆమదాలవలస: ఈ నెల 27న వైసిపి చేపట్టనున్న విద్యుత్ చార్జీల బాధుడు పోరుబాట కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ కోరారు. బుధవారం పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసిపి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో చేపట్టనున్న పోరుబాట నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని వన్‌వే జంక్షన్ వద్ద నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ ప్రజా సంఘాలు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ఆమదాలవలస : దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పలాస : కేక్ కట్ చేస్తున్న కళ్యాణచక్రవర్తి, జగన్నాయకులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

లోకానికి శాంతి, దయ, ప్రేమ, కరుణ వంటి సందేశాలను అందించిన లోక రక్షకుడు ఏసుక్రీస్తు బోధనలు అనుసరరణీయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బుధవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా పురపాలక సంఘం 8వ వార్డు పరిధిలోని చిట్టెమ్మ క్వార్టర్స్‌లో నిర్వహించిన క్రిస్మస్ పండుగ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ కేకుకట్ చేసి క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాస్టర్‌లు ప్రత్యేక ప్రార్థనలు, ఆశీర్వాదాలు, గీతాలాపన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు లోక రక్షకుడు శాంతికాముకుడని అన్నారు. కార్యక్రమంలో పలువురు పాస్టర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అలాగే క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని గ్రేస్ గాస్పల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెవ.జి.కృపావరం దంపతులు పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫాస్టర్ జి.శ్యామ్యూల్ వరం, టిడిపి నాయకులు బోర గోవిందరావు, డాక్టర్ పి.తాతయ్యలు, బోర రమణయ్య, చిన్నం నాయుడు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్వతీనగర్ కాలనీలో ఉన్న సిఎంసి చర్చిలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొన్నారు. క్రైస్తవ సోదరులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలోని పలు చర్చిలను విద్యుత్ కాంతులతో అందంగా ముస్తాబు చేశారు. ఈ వేడుకల్లో పాస్టర్ ప్రభుదాస్, బ్రదర్ జీవన్, టిడిపి నాయకులు శంకర్ భాస్కరరావు, కోటీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని అన్ని చర్చిల్లోను ఎమ్మెల్యే శంకర్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గార మండలం పరిధిలోని అన్ని చర్చిల్లో ఎమ్మెల్యే సతీమణి, నియోజకవర్గ టిడిపి తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి పాల్గొని ప్రత్యేక ప్రార్థన చేశారు.

ఇచ్ఛాపురం : ప్రేమ, మానవత్వం నేర్పిన కరుణామయుడు క్రీస్తు అని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని ఈదుపురం చర్చిలో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్‌ను కట్ చేశారు. క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలను తెలిపారు. కార్యక్రమంలో ఫాస్టర్ బిమో బెహరా, ఎఎంసి మాజీ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, నర్తు ప్రేమ్‌కుమార్, ప్రత్తి అన్వేష్ పాల్గొన్నారు.

పలాస : మండలంలోని గిరిజన సమస్యను పరిష్కరిస్తానని తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి అన్నారు. మండలంలోని పాత్రియలో సియోన్ గ్రేస్ చర్చిలో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం 2025 కేలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గిరిజన యువతులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఫాస్టర్, ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు, ఎఎంసి మాజీ డైరెక్టర్ సవర కృపావతి, గిరిజన సంఘం నాయకులు సవర రాంబాబు, ఇ.సిద్ధు, పి.ఈశ్వరరావు, జె.రామారావు, ఎస్.చంద్రవేఖర్, ఎస్.లోకేశ్వరరావు, ఎస్.రామారావు, ఎస్.కేశవరావు, ఎస్.కిరణ్, అసిస్టెంట్ ఫాస్టర్ ఎస్.సురేష్ పాల్గొన్నారు.

కవిటి: కవిటి రహెబోతు ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు బెందాళం రమేష్, ఆరంగి మధు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో మురళీప్రకాష్, పాండవ శేఖర్, బెందాళం సురేష్, బెందాళం శివ ప్రసాద్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మెళియాపుట్టి, చాపర, కోసమాల, బందపల్లి, నందవ, భరణికోట, భావనాపురం, జాడుపల్లి, నేలబొంతు, ఆంపురం చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

శ్రీకాకుళం అర్బన్ : కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఇచ్ఛాపురం : కేక్‌ను కట్ చేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ